

రూ.2.20 కోట్లతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పరార్
» రాజమహేంద్రవరంలో ఘటన
» పోలీసుల తీరుపై అనుమానాలు
- మెయిన్‌లో



కాకినాడ పోర్టు రోడ్డులోని ఓ గోదాములో బియ్యం నిల్వలు(ఫైల్)

అక్రమార్కులపై ఆప'రేషన్'

- రేషన్ బియ్యం మాఫియాపై అంతకంతకూ ఉచ్చుబిగిస్తున్న కొత్త ప్రభుత్వం
- జిల్లా నుంచి విదేశాలకు పోర్టు ద్వారా బియ్యం తరలకుండా పగడ్బందీ చర్యలు
- ఒకపక్క కొత్తగా చెక్‌పోస్టులు, మరోపక్క గోదాములపై క్రిమినల్ కేసులతో స్పీడ్
- ఇకపై ఇతర ప్రాంతాలనుంచి కాకినాడకు వచ్చే బియ్యంపై పూర్తిస్థాయి నిఘా
- చెక్‌పోస్టుల్లో పోలీసు, రెవెన్యూ, పోర్టు, పౌరసరఫరాలశాఖ అధికారుల బృందం
- యాంకరేజ్ పోర్టు పరిసరాల్లో ఎక్కడెక్కడ ఎన్ని ఏర్పాటు చేయాలనేదానిపై కలెక్టర్ కసరత్తు
- రేషన్ మాఫియాను మట్టుపెట్టాలన్న ప్రభుత్వ పట్టుదలతో కొన్నిరోజులుగా అధికారులు పరుగో పరుగు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ఉక్కుపాదంతో కాకినాడలో రేషన్ మాఫియా వణుకుతోంది. గత ప్రభుత్వ సహకారంతో ఐదేళ్లపాటు యథేచ్ఛగా పేదల బియ్యాన్ని పాలిష్ చేసి విదేశాలకు తరలించేసిన అక్రమార్కులు ఇప్పుడు కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో విలవిల్లాడుతున్నారు. విదేశాలకు రేషన్ బియ్యాన్ని ఏమాత్రం జంకుగొంకు లేకుండా ఇన్నాళ్లు ఎగుమతి చేసిన వీరికి ఇప్పుడు దారులన్నీ మూసుకుపోతుండడంతో ఆపసోపాలు పడుతున్నారు. అధికారుల కళ్లుగప్పి విదేశాలకు తరలించే ప్రయత్నాలు కష్టమవడంతో ఉక్కిబిక్కిరి అవుతున్నారు. కొన్నిరోజులుగా కాకినాడనుంచి విదేశాలకు ఎగుమతవుతున్న రేషన్ బియ్యంపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. మాఫియాను మట్టు పెట్టడంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులోభాగంగా ఇటీవల రేషన్‌బియ్యం ఆనవాళ్లు గుర్తించిన గోదాములపై తాజాగా క్రిమినల్ కేసులు నమోదు చేసింది. పోర్టు పరిసరాల్లో త్వరలో చెక్‌పోస్టులు ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందులో పలుకీలక శాఖల అధికారులను భాగస్వామ్యం చేయబోతోంది. రేషన్ బియ్యం రూపు మార్చుకునేది మిల్లుల్లోనే కాబట్టి అక్కడా నిఘావేసే అంశంపై పరిశీలిస్తోంది. యాంకరేజ్‌పోర్టు నుంచి విదేశాలకు ఇన్నేళ్లలో తరలిపోయిన బియ్యం లెక్కలు కూడా కూపీ లాగుతోంది. అటు రేషన్‌బియ్యం మాఫియాను మట్టుపెట్టాలన్న ప్రభుత్వ పట్టుదలతో అధికారులు సైతం ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

అడ్డూ అదుపూ లేదంతే...

కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యం విదేశాలకు కొన్నేళ్లుగా యథేచ్ఛగా తరలిపోతోంది. యాంకరేజ్‌పోర్టు నుంచి లక్షల టన్నుల బియ్యం అక్రమంగా రూపుమార్చుకుని సముద్రాలు దాటేస్తోంది. ముఖ్యంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రేషన్ దందాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన అనుచరులు లక్షల టన్నుల బియ్యాన్ని ఓడల్లో తరలించేశారు. రేషన్‌బియ్యాన్ని వైసీపీ అండదండలున్న పలువురు వ్యాపారులు రూ.6కి కొనుగోలు చేసి కాకినాడకు లక్షల టన్నుల్లో అయిదేళ్లగా భారీగా తరలించారు. వీటిని ద్వారంపూడి కుటుంబం, ఆయన మనుషులు కొనుగోలు చేసి మిల్లుల్లో నిల్వచేసి ఆనక ఆ బియ్యాన్ని పాలిష్ చేసి కిలో రూ.56 చొప్పున విదేశాలకు కాకినాడ యాంకరేజ్‌పోర్టు నుంచి ఎగుమతి చేసి కోట్లకు కోట్లు సంపాదించారు. ఇదంతా తెలిసినా భయంతో అధికార వ్యవస్థలు ఏం చేయలేక నిస్సహాయంగా మారాయి. ఎక్కడ దాడిచేసి రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నా ఉద్యోగాలు పోతాయన్న భయంతో మాఫియాను వదిలేశాయి. ఇదేఅదనుగా జిల్లా నుంచి భారీగా బియ్యం విదేశాలకు తరలిపోయింది. అధికారుల భయం లేకపోవడంతో జిల్లాలో అనేక మిల్లుల్లో వేల టన్నుల రేషన్‌బియ్యాన్ని నిల్వ చేసి పాలిష్ చేసి సంచులు మార్చి వేరే కొత్త పేరుతో విదేశాలకు తరలించేశారు. యాంకరేజ్‌పోర్టు నుంచి అనుకున్నంత వేగంగా విదేశాలకు బియ్యం వెళ్లడం లేదన్న సాకుతో గత ప్రభుత్వంలో ద్వారంపూడి బియ్యం ఎగుమతులను డీప్‌వాటర్ పోర్టు ద్వారా ప్రత్యేక అనుమతులు తీసుకుని తరలించేశారు. ఒకరకంగా చెప్పాలంటే గోదాములు, మిల్లుల్లో రేషన్‌బియ్యం నిల్వలున్నా అడిగేవారు లేరన్న ధీమాతో రెచ్చిపోయారు. పరిస్థితులు మారి కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్‌బియ్యం మాఫియాపై ప్రత్యేక దృష్టిసారించింది. పేదల బియ్యం పక్కదారి పట్టకుండా ఉచ్చుబిగించింది. ఇక్కడినుంచి విదేశాలకు అక్రమంగా పాలిష్ చేసి ఎగుమతి చేస్తున్న అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతోంది. అందులోభాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడకు వచ్చి పోర్టుతో సహా గోదాములన్నీ తనిఖీ చేశారు. 13 గోదాముల్లో నిల్వలను గుర్తించి వాటి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. సీజ్ చేసిన 50,647 మెట్రిక్ టన్నుల బియ్యంలో 26,488 మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం ఆనవాళ్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో తాజాగా 13 గోదాముల యాజమాన్యాలపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దీంతో ఇప్పుడు కాకినాడ పోర్టు పరిసరాల్లో ఉన్న అనేక గోదాముల నిర్వాహకులు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు ఏ సోదాలు జరుగుతాయోనని అక్రమార్కులు వణుకుతున్నారు. మరోపక్క కేవలం దాడులు చేసి చేతులు దులిపేసుకోకుండా శాశ్వతంగా రేషన్‌మాఫియాకు చెక్ పెట్టేందుకు త్వరలో చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలనుంచి నేరుగా వేలాది లారీల్లో బియ్యం యాంకరేజ్ పోర్టుకు వస్తున్న నేపథ్యంలో వీటిపై నిఘా పెట్టేందుకు చెక్‌పోస్టుల అస్త్రం వాడుతున్నారు. ఈ చెక్‌పోస్టులను దాటుకునే బియ్యం లారీలు గోదాములకు వెళ్లాల్సి ఉంటుంది. తద్వారా అనుమానం వచ్చిన లారీలన్నింటినీ పక్కాగా తనిఖీ చేయనున్నారు. చిన్న రేషన్‌బియ్యం ఆనవాళ్లు దొరికినా లారీ సీజ్‌తోపాటు ఎవరి పేరుతో బియ్యం రవాణా అయిందో వారిపైనా క్రిమినల్ కేసులు పెట్టేలా చర్యలు చేపడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే చెక్‌పోస్టుల్లో పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాలు, పోర్టు అధికారులతో కూడిన బృందాన్ని నియమించనున్నారు. పోర్టుకు వచ్చే దారులన్నింటిలోను వీటిని ఏర్పాటు చేయడానికి కలెక్టర్ సన్నాహాలు ప్రారంభించారు.

అధికారులు పరుగో.. పరుగు..

రేషన్‌బియ్యం మాఫియాను ఇంతకాలం అధికారులు తేలిగ్గా తీసుకున్నారు. కొందరు అధికారులు ముడుపులు తీసుకోవడం, అటు ప్రభుత్వపెద్దల భయంతో చూసీచూడనట్టు వదిలేశారు. కానీ కొత్త ప్రభుత్వం మాత్రం రేషన్‌బియ్యం మాఫియాను తీవ్రంగా పరిగణిస్తోంది. దీంతోనే స్వయంగా మంత్రి తనిఖీలకు రావడం, అటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అసెంబ్లీలోను, బయట ఈ విషయమై పలుసార్లు కూడా మాట్లాడారు. త్వరలో బియ్యం మాఫియాపై సీఐడీ విచారణకు కూడా ఆదేశించనున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం క్రిమినల్ కేసులు నమోదైన గోదాములతోపాటు ఇతర గోదాముల్లోను మరిన్ని తనిఖీలు చేయాలని నిర్ణయించారు. ఐదేళ్లపాటు విదేశాలకు యాంకరేజ్‌పోర్టు నుంచి రవాణా అయిన బియ్యం విలువ వివరాలు సేకరించారు. దాదాపు రూ.800కోట్లకుపైగానే విలువైన రేషన్ తరలిపోయిందని గుర్తించారు. దీంతో ఇటీవల పట్టుబడ్డ గోదాములనుంచి బియ్యం ఏ కంపెనీలు ఎగుమతి చేశాయి? వీటికి బియ్యం సరఫరా చేసింది ఎవరు? వంటి వివరాలను కూడా కూపీ లాగుతున్నారు. రేషన్‌బియ్యానికి పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి కావడానికి వీలుగా ప్యాకింగ్ జరిగేది పూర్తిగా మిల్లుల్లోనే కాబట్టి అసలు మాఫియా అక్కడినుంచే మొదలవుతోంది. ఇదే విషయం ఇటీవల కలెక్టర్, ఎస్పీ, పోర్టు అధికారుల సమక్షంలో చర్చ జరిగింది. కాబట్టి అన్నిమిల్లుల్లో కాకపోయినా అనుమానాస్పదంగా ఉన్నవి, నేతలకు సంబంధించిన వాటిపైనా ఓ కన్నేసి ఉంచాలని భావిస్తున్నారు. ఇదంతా ఒకెత్తయితే మిల్లుల విద్యుత్ బిల్లుల ఆధారంగాను రేషన్ బియ్యం మాఫియాను కొంతవరకు గుర్తించే అవకాశం ఉందని చెబుతున్నారు. మిల్లులకు ప్రభుత్వం ఇచ్చే సీఎంఆర్‌కు అవసరమైన విద్యుత్‌కు మించి ఎక్కువ వాడకం జరిగితే లోపల అనుమానాస్పద వ్యవహారాలు జరిగే అవకాశం ఉన్నట్లు లెక్క. తద్వారా రేషన్ మాఫియాను ప్రారంభ దశలోనే గుర్తించి మట్టుపెట్టవచ్చనే దిశలోను అధికారులు ఆలోచిస్తున్నారు.

పీడీఎస్ బియ్యంపై సమగ్ర దర్యాప్తు

- ఐదు రాష్ట్రాల పీడీఎస్ బియ్యం గుర్తింపు
- కొనసాగుతున్న పోలీసులు దర్యాప్తు
- ఆంధ్ర, బీహార్, చత్తీస్‌గడ్, పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లో పీడీఎస్ బియ్యం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26: కాకినాడలో గొడౌన్లలో లభించిన పీడీఎస్(కెర్నెల్స్) ఉన్న పోర్టిఫైడ్ బియ్యంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. కాకినాడ డీఎస్పీ హనుమంత్‌రావు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తోపాటు బీహార్, చత్తీస్‌గడ్, పశ్చి మబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన లారీల్లో కూడా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కాకినాడ గొడౌన్లకు వచ్చిన బియ్యం సంబంధిత బిల్లులను పరిశీలించి అధికారులు ఈ విషయాన్ని గుర్తించారు. ఆయా రాష్ట్రాల్లో ఎంతమేరకు కాకినాడకు బియ్యం రవాణా చేస్తున్నారు అనే విషయాలు బిల్లులపై పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బియ్యం మాఫియా ఐదు రాష్ట్రాల్లో విస్తరించినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో పీడీఎస్ బియ్యాన్ని బియ్యం మాఫియా ఆయా రాష్ట్రాల్లో ఎలా సేకరిస్తుంది. రవాణా ఎలా చేస్తుంది. ఆ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు ఎలా తర లిస్తున్నారు. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ మాఫియాను పెంచి పోషించింది. దీంతో ఇది రాష్ట్రం దాటి ఇతర రాష్ట్రాలకు కూడా విశాలంగా విస్తరించింది. ఈ మాఫియాలో రాష్ట్రంలో ఉన్న అక్రమార్కులేనా? లేకపోతే ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు దీనిలో భాగస్వాములయ్యారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తును వేగవంతం చేయడానికి పోలీసులు కస్టమ్స్ అధికారులు, పోర్టు అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సాయం కూడా తీసుకుంటున్నారు.

దాడులకు ప్రత్యేక బృందాలు

ఐదేళ్లుగా జరుగుతున్న ఈ మాఫియాను నివారిం చాలంటే ప్రభుత్వం ప్రత్యేక బృందాలు నియమించాలని పలువురు అంటున్నారు. ఈ బృందాలు నిరంతరం పోర్టు కార్యకలాపాలపై దృష్టి కేంద్రీకరించి బియ్యం ఎగుమతు లపై నిఘా పెట్టాల్సి ఉంది. పీడీఎస్(కెర్నెల్స్) పోర్టిఫైడ్ బియ్యం గుర్తించేందుకు ఈ బృందాలకు అధికారం ఇవ్వాల్సి ఉంది.



మడ అడవుల సంరక్షణపై విడుదల చేసిన పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్

ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవులను సంరక్షించుకోవాలి

- రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్
- ప్రపంచ మడ అడవుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా మడ అడవుల సందర్శన

కాకినాడ సిటీ, జూలై 26: భావితరాల భవిష్యత్తు కోసం మడ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచ మడ అడవుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లాకు విచ్చేసిన ఆయన కాకినాడ దుమ్ములపేట సమీపంలోని మడఅడవుల ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యంగా చిన్నారులు ప్రకృతి, పర్యావరణం, పంచ భూతాలపట్ల ప్రేమభావంతో ఉండి వాటి సంరక్షణకు పాటుపడాలన్నారు. మడ అడవుల్లో ప్లాస్టిక్‌ను సమూలంగా నిషేధించడంతోపాటు వాటి పరిరక్షణకు అటవీశాఖ అధికారులు కాపాడుతున్నారన్నారు. కాకినాడ సమీపంలో ఉన్న మడఅడవులు చాలా మేలు చేస్తున్నాయన్నారు. ప్రకృతిసహజ సిద్ధంగా ఏర్పడిన ఈ మడ అడవులను ధ్వంసం చేసి ఇళ్ల స్థలాలకోసం గ్రావెల్‌తో నింపడం సరికాదన్నారు. సామాజిక పర్యావరణవేత్త, జనసేన సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాజస్థాన్ వాసి అయిన రాజేంద్రసింగ్ ఆంధ్ర రాష్ట్రంలో అంతరించిపోతున్న ఐదు నదులకు జీవం పోసి వెయ్యి గ్రామాలకు నీరందంచి వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఘనత సాధించారన్నారు. పర్యావరణానికి ఎక్కడ చేటు జరిగినా ఆయన అక్కడకు వచ్చి పరిరక్షిస్తారన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ఈ మడ అడవులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అంతకుముందు వీరంతా తాళ్లరేవు మండలం కోరంగి అభయారణ్యంలో పర్యటించారు. ప్రపంచ మడఅడవుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా మడ అడవుల సంరక్షణపై విడుదల చేసిన పోస్టర్ ను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం బోటుపై గోదావరిలో పర్యటించి మడ అడవులను పరిశీలించారు. ఈ సందర్శనలో పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ప్రెసింగి ఆదినారాయణ, దుగ్గన బాబ్జి పాల్గొన్నారు.



కోరంగిలో మడఅడవుల మధ్య బోటుపై పయనిస్తున్న రాజేంద్రసింగ్



కాకినాడలో మడ అడవుల ప్రాంతాన్ని పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యతో కలిసి పరిశీలిస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకేలో ఐదుగురు సలహాదారుల నియామకం

- వీరి నియామకంతో డైరెక్టర్ల అవసరం ఉన్నట్లా.. లేనట్లా?

జేఎన్టీయూకే, జూలై 26: కాకినాడ జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ నూతన సంస్కృతికి తెరలేపారు. ఆయనకు ఐదుగురు సలహాదారుల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ సుమలత గురువారం జారీ చేశారు. సలహాదారుల్లో ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, అనంతపురం జేఎన్టీయూఏ మాజీ వీసీ ఎస్.శ్రీనివాస్‌కుమార్, అక్నూ మాజీ వీసీ కె.పద్మరాజు, జేఎన్టీయూకే మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, ఎం.రామలింగరాజు. వీరిలో పి.ఉదయభాస్కర్, ఎం.రామలింగరాజు గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులుపడ్డారు. శ్రీనివాస్‌కుమార్ జేఎన్టీయూఏ వీసీగా మూడేళ్ల బాధ్యతలు నిర్వహించి ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. పద్మరాజు, ప్రసాదరాజు ఇటీవల వీసీ పదవులకు రాజీనామా చేసి ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనకు డైరెక్టర్లు ఉండగా సలహాదారులను నియమించడంతో డైరెక్టర్లు అవసరం లేదా? అనే సందేహాన్ని అధికారులు వెలిబుచ్చుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణను వివరణ కోరగా సలహాదారులకు గౌరవవేతనం కానీ, ప్రత్యేక సౌకర్యాలు, క్యాబిన్ కేటాయింపులు కానీ ఉండవన్నారు.

నేడు, రేపు పంచాయతీరాజ్ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ జిల్లా పర్యటన

పిఠాపురం/కార్పొరేషన్(కాకినాడ), జూలై 26: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టరు మైలవరపు కృష్ణతేజ రెండురోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలతోపాటు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పంచాయతీరాజ్ డైరెక్టరుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారిగా జిల్లాల పర్యటనకు పిఠాపురంనుంచే శ్రీకారం చుడుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆయనను ప్రత్యేకంగా కోరి కేరళ కేడర్ నుంచి ఏపీ కేడర్‌కు డిప్యూటేషన్‌పై తీసుకువచ్చి పంచాయతీరాజ్ డైరెక్టరుగా నియమించుకున్న సంగతి తెలిసిందే. పంచాయతీరాజ్ డైరెక్టర్ పర్యటనకు సంబంధించిన వివరాలు జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భారతి శుక్రవారం విడుదల చేశారు.

రెండురోజుల షెడ్యూల్ ఇలా..

పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ శనివారం ఉదయం 9.30గంటలకు గొల్లప్రోలు మండలం వన్నెపూడి చేరుకుని అక్కడ జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను, ఫ్లోరీకల్చర్ ద్వారా గులాబీ మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తారు. చెందుర్తిలో ఉద్యానవన తోటల పెంపకంలో భాగంగా జామతోటలను, చేబ్రోలులో బ్లాక్ ప్లాంటేషన్‌ను, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను తనిఖీ చేస్తారు. అక్కడినుంచి పిఠాపురం మండలం చిత్రాడ చేరుకుని రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను, తాగునీటి క్లోరినేషన్‌ను తనిఖీ చేసి కుమారపురంలోని సచివాయాన్ని సందర్శిస్తారు. ఎఫ్‌కేపాలెంలో స్కూలు కాంపౌండ్ వాల్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్, బ్లాక్ ప్లాంటేషన్, సచివాలయాలను తనిఖీ చేస్తారు. కందరాడలో సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కొత్తపల్లి మండలం వాకతిప్ప చేరుకుని అక్కడ నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తారు. అమరవిల్లిలో మామిడితోటల పెంపకం, బ్లాక్ ప్లాంటేషన్‌లను, మూలపేటలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును తనిఖీ చేస్తారు. రాత్రికి పిఠాపురంలోనే బస చేసి ఆదివారం ఉదయం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈలు, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు సహా జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొని పలు అంశాలపై సమీక్షిస్తారు.

పెద్దాపురం, జగ్గంపేటల్లోను పర్యటన

సామర్లకోట/జగ్గంపేట, జూలై 26: పంచాయతీరాజ్ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లోను శనివారం పర్యటిస్తారని అధికారులు తెలిపారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, తాగునీటి సరఫరాలో ఇన్‌లైన్ క్లోరినేషన్ చర్యల ఫలితాలను పరిశీలిస్తారని వారు చెప్పారు.

నూతన ఇసుక విధానంపై జిల్లా కలెక్టర్లతో గనులశాఖ సీఎస్ సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఇసుక విధానంపై శుక్రవారం అమరావతి సచివాలయంనుంచి రాష్ట్రగనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా మైనింగ్ అధికారులతో కలిసి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన ఇసుక విధానానికి సంబంధించి జిల్లాల్లో ఇసుక కార్యకలాపాలు, ఇసుక తరలింపునకు వివిధ వాహనాలకు ధరల నిర్ణయం, కొత్త ఇసుక రీచ్‌ల గుర్తింపు, డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచడం, డీసిల్టేషన్, స్టాక్‌పాయింట్లు, నూతన ఇసుక విధానం పటిష్ట అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక వంటిఅంశాలపై గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖూష్‌కుమార్‌మీనా జిల్లా కలెక్టర్లతో చర్చించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్‌కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాకినాడలోని పురాతన కట్టడాలను సంరక్షించుకోవాలి - 7లో
» రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్

సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయానికి కొలతలు తీసిన టీటీడీ బృందం - 7లో

10లోపు రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి: డీఈవో

కాకినాడ రూరల్, జూలై 26: జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక, ఇతర అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కనీసం 15ఏళ్లు పనిచేసిన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు ఆగస్టు 10లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. deoeg.org వెబ్‌సైట్‌లో ఉంచిన దరఖాస్తును పూరించి సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా కాకినాడ డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఏలేరుకు జలకళ

- వర్షాలతో ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు
- జోరుగా సాగుతున్న ఖరీఫ్ సాగు



ఏలేరు నదిలో కలుస్తున్న గోదావరి నీరు

ఏలేశ్వరం, జూలై 26: ఏలేశ్వరంలోని ఏలేరు రిజర్వాయర్ పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేయనుంది. మూడు నెలల క్రితం నీటి నిల్వలు కనిష్టస్థాయికి పడిపోయాయి. దీనివల్ల ఖరీఫ్ సాగుపై అధికారులు రైతుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టిన కొన్నిరోజుల్లోనే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించింది. ఇదే సమయంలో అల్పపీడపన ప్రభావంతో ఎగువప్రాంతం నుంచి వర్షపు నీరు ప్రాజెక్టుకు భారీగానే చేరింది. ఈ రెండింటి ద్వారా వచ్చిన జలాలతో ఏలేరులో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుత ఖరీఫ్ పనులపై ఏలేరు రైతులకు పూర్తి భరోసా ఇచ్చింది.

ప్రాజెక్టులో నిల్వలు

ఏలేరుకు 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రానికి 77.75 మీటర్ల స్థాయిలో 10.98 టీఎంసీల నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంపుల నుంచి ఏలేశ్వరం రిజర్వాయర్‌కు 875 క్యూసెక్కుల నీరు వంతున కొద్దికాలంగా సరఫరా చేస్తున్నారు. అదనంగా ఎగువ ప్రాంతం నుంచి 2435 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇటీవల వర్షాలు కురవడంతో ప్రాజెక్టు నుంచి సాగునీటి అవసరాలకు నీటి సరఫరాను నిలిపివేశారు. ఎడమ కాలువ ద్వారా విశాఖ నగరానికి 280 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఎగువ ప్రాంతంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఏలేరుకు మరిన్ని జలాలు రానున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

జోరుగా ఖరీఫ్ పనులు

ఏలేరు ఆధారిత ప్రాంతంలో 53వేల ఎకరాలకు ప్రాజెక్టు నుంచి నీరు వెళ్తోంది. రిజర్వాయర్‌లో నీటినిల్వలు డెడ్‌స్టోరేజ్ దాటి 11టీఎంసీల వరకు వచ్చింది. ఈక్రమంలో ఆయకట్టు రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే నారుమళ్లు సిద్ధం కావడంతో పలుచోట్ల ఊడుపులు జరుగుతున్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు చేరకపోయినా గోదావరి జలాలు వస్తుండడంతో సాగుపై అధికారులు పూర్తి భరోసా ఇస్తున్నారు. ఏలేరు పరిధిలోని ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లోని భూములు సస్యశ్యామలం కానున్నాయి. పురుషోత్తపట్నం పథకం తిరిగి అమలుకు రావడంతో రైతులు ధీమాగా సాగు పనులు చేసుకుంటూ పోతున్నారు. అధికారులు వంతులవారీగా జరిగే నీటి సరఫరాపై పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలని అప్పుడే నిర్ధారిత ఆయకట్టుకు సక్రమంగా జలాలు అందుతాయని రైతులు అంటున్నారు.

కాకినాడలోని పురాతన కట్టడాలను సంరక్షించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రసింగ్

● రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, జూలై 26: కాకినాడ నగరంలోని పురాతన సంపద, కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వాటర్‌మెన్ ఆఫ్ ఇండియా రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే, పీడబ్ల్యూసీడీఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో వారసత్వ సంపద భవిష్యత్తు, కార్యాచరణ అనే అంశంపై శుక్రవారం నగర ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, పీడబ్ల్యూసీడీఎఫ్ సమన్వయకర్త పి.ఆదినారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాజేంద్రసింగ్, విశిష్ట అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గౌరవఅతిథులుగా సామాజిక కార్యకర్త, జనసేన పార్టీ సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పర్యావరణవేత్తలు రత్నం, మృత్యుంజయరావు పాల్గొన్నారు. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ కాకినాడలో పురాతన కళాశాలలు, జాతీయ వారసత్వ సంపద, మడ అడవులు ఉన్నాయన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్సిటీలో 75ఏళ్లు దాటిన అతిపెద్ద వృక్షాలున్నాయని, వాటిని సంరక్షించేందుకు ప్రతిఏటా పెన్షన్ ఇస్తున్నామన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మడ అడవుల్లోని ప్రతిజీవి వారసత్వ సంపదేనని తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ మడ అడవులు, హోప్ ఐలాండ్‌వల్ల కాకినాడ నగరం సంరక్షింపబడుతోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, అధ్యాపకులు, పర్యావరణవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయానికి

కొలతలు తీసిన టీటీడీ బృందం



సత్యదేవుడి విమానగోపురం కొలతలు తీసుకుంటున్న టీటీడీ బృందం

● అంచనా వ్యయం రూ.10కోట్లకు పెరిగే అవకాశం

అన్నవరం, జూలై 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయం చేసేందుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఇప్పటికే ఒక పర్యాయం దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప నేతృత్వంలో ఒక కమిటీ పరిశీలన జరిపి సుమారు 11కేజీల బంగారం పడుతుందని అంచనా వేయగా దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం టీటీడీ డిప్యూటీ ఈఈ చంద్రమౌళీరెడ్డి, అసిస్టెంట్ స్థపతి మురళీశంకర్, అప్రయిజర్ నాగరాజు, సూపరింటెండెంట్ మనోహర్‌ల బృందం విమానగోపురం కొలతలను తీసుకున్నారు. విమానగోపురంపై దేవతామూర్తుల విగ్రహాలు ఉండడంతో ప్రతీ అంగుళం కొలతలు తీసుకున్నారు. 10 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తు ఈ ఆలయశిఖరంపై సుమారు 50 దేవతామూర్తులు విగ్రహాలున్నాయి. అప్పటి అంచనా ప్రకారం సుమారు 7.5 కోట్లు కాగా, ప్రస్తుతం ధరలు అప్పటితో పోల్చితే పెరగడం, దేవతామూర్తుల విగ్రహాలు కొలతలు ప్రాథమికంగానే తీసుకోవడంతో అంచనా వ్యయం సుమారు రూ.10 కోట్లకు చేరుతుందన్నారు. దీనిపై దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌తో చర్చించి నివేదకను దేవదాయకమిషనర్‌కు అందజేస్తామని బృందసభ్యులు తెలిపారు. ఈనెల 30న అంచనా వ్యయం రిపోర్టు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి తదితరులున్నారు.

తగ్గుతూ... పెరుగుతూ గోదావరి

● ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
● కాటన్‌బ్యారేజ్ నుంచి 12.44లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
● భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ధవళేశ్వరం, జూలై 26: వారం రోజులుగా గోదావరి ఉధృతి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరదనీరు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహించేలోగా మరలా ఎగువన నీటి మట్టం పెరుగుతుంది. దీంతో ఎగువన భద్రాచలం వద్ద, దిగువన ధవళేశ్వరం వద్ద ప్రమాదహెచ్చరికలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నానికి 2గంటలకు 13.40అడుగుల వరకు తగ్గిన నీటి మట్టం 12గంటలు పాటు నిలకడగా కొనసాగింది. ఆపై స్వల్పంగా పెరుగుతూ 15గంటల వ్యవధిలో 3 పాయింట్లు పెరిగి శుక్రవారం సాయంత్రం 5గంటలకు 13.70అడుగులకు చేరింది. మరలా తగ్గుముఖం పట్టి రాత్రి 7గంటలకు 13.50 అడుగులుగా ఉంది. కాటన్ బ్యారేజ్ నుంచి 12,44,232 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఇదే సమయంలో భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 48.60 అడుగులకు చేరుకుంది.



నాటుపడవపై చింతరేగుపల్లి చేరుకుంటున్న వరద బాధితులు



చింతూరులో మల్లెతోటకు విద్యుత్ సరఫరాకోసం మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద వరద ఉధృతి

మళ్లీ పెరుగుతున్న గోదావరి, శబరి

చింతూరు, జూలై 26 : తగ్గినట్టే తగ్గిన గోదావరి, శబరి నదులు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి అతి చేరువగా 48. 60 అడుగులకు చేరుకుంది. ఇక చింతూరు వద్ద శబరి నది 37.5 అడుగులకు చేరింది. దీంతో రహదారులు ఇంకా ముంపులోనే ఉండి రాకపోకలు దాదాపు వారం రోజులుగా స్తంభించిపోయాయి. ముంపు బాధితులతో పాటు అధికార యంత్రాంగం నాటు పడవలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాలకు చెందిన విద్యుత్ సరఫరా లైన్లు నీటమునగడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది ముంపునకు గురైన విద్యుత్ స్థంభాల వద్దకు నాటు పడవలపై చేరుకొని ఆయా స్థంబాలను షైట్ టి రైజర్సు ద్వారా ఎత్తు పెంచి విద్యుత్ సరఫరా ఇచ్చే దిశగా చర్యలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్ఎన్వి రాఘవన్ బృందం ముంపు ప్రాంతాలలో సందర్శించి పారిశుధ్యం చర్యలు చేపట్టే దిశగా చర్యలు చేపట్టారు. అదే దశలో విస్తృతంగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయించారు.

మెడికల్ ఆఫీసర్‌ను వేధించి

తిరిగి తప్పుడు ఆరోపణలు

● ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు
● సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కాకినాడ సిటీ, జూలై 26: జిల్లా ఫైలేరియా విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.రాధాకృష్ణ కనిపించకపోవడానికి ఎఫ్ఆర్‌టీసీ మెడికల్ ఆఫీసర్ వేధింపులే కారణమని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఆర్ పవన్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్ర వారం వారు కలెక్టర్‌ను కలిసి ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సదరు మెడికల్ ఆఫీసర్‌ను కలిసి తాము విచారించామని, రాధాకృష్ణ తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా ఆ విషయాన్ని డీఎంహెచ్‌వో, ఆర్‌డీల దృష్టికి తెచ్చానని తెలిపారన్నారు. దీనిపై విచారణ అధికారి విచారణచేసి డీఎంహెచ్‌వో, ఆర్‌డీలకు నివేదిక సమర్పించినట్లు వివరించారన్నారు. ఇది జరిగిన తర్వాత రాధాకృష్ణ కనిపించకపోవడంతో దాన్ని ఆసరాగా చేసుకుని తిరిగి బాధితురాలైన వైద్యాధికారిణిపై ఆరోపణలు చేస్తుండడంతో ఆమె ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కానీ వాస్తవానికి ఇబ్బంది పడింది ఆ మహిళా వైద్యాధికారిణే అన్నారు. ఆమెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరగకపోగా తిరిగి ఆమెపై నిందలు మోపుతున్నారన్నారు. ఒక మహిళా అధికారికి పనిచేసే స్థలంలో సరైన భద్రత లేకపోవడంతో మిగిలిన మహిళా అధికారులకు అభద్రతాభావం కలుగుతోందన్నారు. దీన్ని తమ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో లను కలిసి సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరామన్నారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారని ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు.

హత్యకేసులో తండ్రితో సహా

కుమారులకు యావజ్జీవ శిక్ష

ద్రాక్షారామ, జూలై 26 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం మండలం యనమదలలో సాదే జనార్ధనరావు హత్యకేసులో అదే గ్రామానికి చెందిన దారా అప్పారావు అతని కుమారులు దారా సింహాద్రి, దారా చంటి, దారా రాజశేఖర్‌లకు యావజ్జీవ కారాగార శిక్ష రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యనమదల గ్రామానికి చెందిన దారా అప్పారావుకు చెందిన పాడె గేదెలు సాదె జనార్ధనరావుకు చెందిన భూమి సరిహద్దులోకి వెళ్లి మొక్కలు పాడుచేస్తున్న విషయమై ఇరువురికి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2015 సెప్టెంబరు 6న మధ్యాహ్నం 2 గంటలకు సాదె జనార్ధనరావుకు చెందిన స్థలంలోకి దారా అప్పారావు అతని కుమారులు దారా సింహాద్రి, దారాచంటి, దారా రాజశేఖర్‌లు కత్తులు, కర్రలతో అక్రమంగా ప్రవేశించి సరిహద్దులో కర్రల దడిపాడు చేసి సాదె జనార్ధానరావుకు చెందిన చింతచెట్టును నరికి పాడు చేస్తుండగా సాదె జనార్ధనరావు అతని కుమారులు వెళ్లి దౌర్జన్యంపై ప్రశ్నించగా దారా సింహాద్రి కత్తితో సాదె జనార్ధనరావును మెడ వెనుక చావరా అంటూ నరికాడు. దీంతో సాదె జనార్ధనరావు రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. సాదె జనార్ధనరావు రెండవ కుమారుడు దుర్గాప్రసాద్ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ కె.వంశీధర్ కేసు నమోదు చేయగా సీఐ పి.కాశీవిశ్వనాధం కేసు దర్యాప్తుచేసి సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం 10వ ఏడీజే ఎస్సీ, ఎస్టీ కోర్టు లో స్పీడ్ ట్రయల్ నిర్వహించగా నేరం రుజువు కావడంతో నింది తులు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేలు చొప్పన జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసులో కేసు నమోదుచేసిన ఎస్ఐ వంశీధర్, సీఐ పి.కాశీవిశ్వనాదరావు, స్పీడ్ ట్రయల్ నందు కృషి చేసిన ఎస్ఐ జి.సురేంద్రను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

● ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన రామయ్య



రోప్ సహాయంతో రిస్క్ చేసి కాలువ దాటుతున్న విద్యుత్ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26 : ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని విద్యుత్ సిబ్బంది సాహసోపేతంగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారు. రంపచోడవరం డివిజన్‌కు చెందిన మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం సున్నంపాడు గ్రామానికి విద్యుత్ సిబ్బంది వెళ్లి ఫీడర్ లైన్‌పై వెదురు బొంగులు ఇతర చెట్లు పడిపోవడంతో అక్కడ ఆగిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సుమారు 800 మందిజనాభా కలిగిన సున్నంపాడు, దేవరపల్లి గ్రామాలకు కాలువను తమ జెఎల్ఎమ్ కూర రామయ్య విద్యుత్ కండక్టర్ సహాయంతో దాటి విద్యుత్ సరఫరాను అందించినట్లు ఏపీ ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రామయ్యను ఎస్ఈ అభినందించారు. సహకరించిన గ్రామస్తులకు ధన్యవాదలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



దొంగ రవిదుర్గాగణేష్

అమలాపురంరూరల్, జూలై 26: స్నేహితులిద్దరూ పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా రోడ్డు బెర్ములో మోటారు సైకిల్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాలతో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీ మ జిల్లా అమలాపురంరూరల్ పేరూరు తోట్లపాలేనికి చెందిన దొంగ రవిదుర్గాగణేష్ (26) తాపీ పనిచేస్తుండగా స్నేహితుడైన గెద్దాడ ఓంసాయి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతోదుర్గాగణేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఓంసాయి తీవ్ర గాయాలపాలు కాగా స్థానికులు హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా పూర్తిచేసి దుర్గాగణేష్ మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ క్రిస్టఫర్ తెలిపారు. మృతుడికి తల్లి శ్యామల, తండ్రి సత్యనారాయణతో పాటు సోదరుడు ఉన్నారు. తల్లిదండ్రులతో పాటు దుర్గాగణేష్ ఏరోజుకారోజు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

మహిళపై గొడ్డలితో దాడి

● తీవ్రంగా గాయపడ్డ మహిళ
● సరిహద్దు గోడ వివాదమే కారణమా



తీవ్రంగా గాయపడిన మహిళ, ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, జూలై 26: పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఇంటి పక్కనే ఉంటున్న మహిళపై ఒక వ్యక్తి గొడ్డలితో విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని రంగప్పచెరువు వీధిలో వాటర్‌ట్యాంకు ఎదురుగా నేకూరి రాజ్యలక్ష్మి తన భర్త, కుమారులతో కలిసి అద్దె ఇంటిలో నివాసముంటున్నది. వీరికి సమీ పాన వేమగిరి రాజేష్ అతని తల్లితో కలిసి ఉంటున్నాడు. వాళ్లింటిని ఎడమవైపున రాజ్యలక్ష్మి కుటుంబానికి ఖాళీస్థలం ఉంది. ఈ స్థలం లోకి వచ్చి గోడ కట్టుకున్నారంటూ రాజేష్‌కు, రాజ్యలక్ష్మి కుటుంబానికి మధ్య వివాదం కొంతకాలంగా ఉంది. ఈ విషయంలో పెద్ద మనుషుల్లో పెట్టగా గోడను సరిచేసుకోవాలని వారు రాజేష్‌కు సూచించారు. దీంతో రాజేష్ కక్ష పెంచుకుని అప్పటి నుంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. భర్త వ్యవసాయ పనులకు వెళ్లి రాజ్యలక్ష్మి ఇంటి వద్ద బయట టీ పెట్టుకుంటున్నది. దీనిని గమనించి రాజేష్ తన తల్లి లక్ష్మీతో ఆమె వద్దకు వెళ్లి అకస్మాత్తుగా గొడ్డలితో తలపై, శరీరంపై పలుచోట్ల విచక్షణారహితంగా నరికాడు. దీంతో తీవ్రంగా గాయపడి రక్తపుమడుగులో ఉన్న ఆమెను తొలుత పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా రాజేష్ ఇదే తరహాలో నాలుగేళ్ల క్రితం తన మేనమామ ద్రాక్షారపు భూషణంపై దాడి చేయగా దీనిపై కేసు నమోదైంది. మహిళపై గొడ్డలితో దాడిచేసిన సంఘటన పట్టణంలో సంచలనం కలిగించింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ జాన్‌భాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాత్రి రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

స్వదేశానికి వీరేంద్రకుమార్

● మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన వీరేంద్ర



హైదరాబాద్‌లోని కుటుంబ సభ్యులతో వీరేంద్రకుమార్

అంబాజీపేట, జూలై 26: ఏజెంట్ మోసంతో సౌదీలో చిక్కుకుని నరక యాతన పడిన సరెళ్ళ వీరేంద్రకుమార్ మంత్రి నారా లోకేశ్ కృషితో స్వదేశానికి చేరుకున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన వీరేంద్రకుమార్ సౌదీలో ఒంటెల కాపరిగా ఉండి తాను పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేసినవిషయం విధితమే. ఈమేరకు మంత్రి నారా లోకేశ్ స్పందించి అక్కడి టీడీపీ ఎన్ఆర్ఐలు, జిల్లా కలెక్టర్, అధికారులు ఏంబీసీతో మాట్లాడి స్వదేశానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వీరేంద్ర హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగాడు. అక్కడ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి హైదరాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి చేరుకున్నాడు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి చేరుకుంటానని వీరేంద్ర తెలిపారు. తనని స్వదేశానికి తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ కూటమి, ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు వీరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి వేధింపులు తాళలేక గర్భిణి ఆత్మహత్య

నల్లజర్ల, జూలై 26: ప్రియుడి వేధింపులు తాళలేక మూడు నెలల గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పోతవరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. పోతవరం గ్రామానికి చెందిన బాకీ వెంకట్రావు, నాగలక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె విజయదుర్గ(21) ఈ ఏడాది మార్చి నెల వరకు గ్రామంలో వలంటీర్‌గా పనిచేసింది. ఏప్రిల్ 3న ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ఈశ్వర్‌తో వివాహం జరిగింది. ఆషాఢ మాసం కావడంతో విజయదుర్గ పుట్టింటికి పోతవరం వచ్చింది. అదే గ్రామానికి చెందిన ప్రియుడు సిమెంట్ పనులకు వెళ్లే దెబ్బెం ధనరాజు వేధింపులకు పాల్పడుతున్నాడు. విజయదుర్గ తనకు పెళ్లయిందని ఇంతటితో వదిలేయమని ప్రాధేయపడింది. అయినా పట్టించుకోకుండా పదే పదే వేధించడంతో హెచ్చరించింది. దీంతో ధనరాజు గతంలో తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, ఫోన్ సంభాషణ పూళ్లలో ఉంటున్న విజయదుర్గ భర్తకు పం పించాడు. దీంతో భర్త ఫోన్‌లో మందలించడంతో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. జీవితంపై విరక్తి చెందిన విజయదుర్గ బుధవారం ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చి ముందుగా నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ప్రత్తిపాడులో

వైద్య ఉద్యోగి ఇంట్లో చోరీ

● రూ.7లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణ



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ ప్రత్తిపాడు సీఐల బృందం

ప్రత్తిపాడు, జూలై 26: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వైద్యఉద్యోగి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.7లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు దొంగలు అపహరించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ చోరీ ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదుల మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రత్తిపాడులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి, భార్య సత్యకాంత ఇరువురు పిల్లలతో డాబా ఇంట్లో నివసిస్తున్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట పీహెచ్‌సీలో మచ్చకర్ల అప్పలస్వామి ఫార్మశిస్టుగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం ఇంటివద్ద ఉన్న అతని భార్య సత్యకాంత స్థానిక బస్టాండ్ సమీపంలోని తన తల్లి నిర్వహిస్తున్న దుకాణం వద్దకు వెళ్లింది. అదే సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో భద్రపరిచిన రూ.3లక్షల నగదుతోపాటు రూ.4లక్షలు విలువచేసే 12రకాల బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. డాబాపై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణ పనులు ఒక వైపు జరుగుతున్నా కింది ఫ్లోర్‌లో తలుపులకు తాళాలు వేసినా దుండగులు చాకచక్యంగా లోపలికి వెళ్లి ఈ చోరీకి పాల్పడ్డారు. ఇందుకూరుపేట పీహెచ్‌సీ నుంచి అప్పల స్వామి ప్రత్తిపాడు చేరుకుని తన ఇంటిపై జరుగుతున్న నిర్మాణ పనులు పరిశీలించేందుకు వెళుతూ కిటికీలోంచి బెడ్‌రూంలోని వస్తువులు చిందరవందరగా ఉండటాన్ని గమనించి మెయిన్ డోర్ తాళాలు తీసి పరిశీలించగా చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదుతో పాటు రూ.4లక్షలు విలువచేసే 20 కాసుల బంగారు నెమలి లాకెట్, రెండు రకాల నల్లపూసల తాళ్లు, రెండు రకాల చెవిదిద్దులు, బ్రాస్‌లెట్‌లు, చైన్‌లు, మూడు ఉంగరాలు, రెండు రూపులు, గ్రీన్‌స్టోన్ చెవిదిద్దులు తదితర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టపగలు తమ ఇంట్లో మూసిన తలుపులు మూసినట్లు వేసిన తాళాలు వేసినట్లు ఉండగా దుండగులు ఏ విధంగా చోరీకి పాలపడ్డారో అర్థం కావడంలేదని బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని శుక్రవారం సాయంత్రం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్‌లు సందర్శించారు.కాకినాడ నుంచి క్లూస్ టీం, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని మన్ననలను పొందిన పెయింటింగ్



నరేంద్రమోదీ మనసు దోచిన హరి తాడోజు పెయింటింగ్ ఫోటో

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 26: ప్రధాని నరేంద్ర మోదీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసిన ప్రముఖ చిత్రకారుడు, స్ట్రోకర్స్ అధినేత హరి తాడోజు పెయింటింగ్ ప్రధాని మన్ననలు పొందింది. ఇటీవల ప్రధాని కన్యాకుమారిలో ధ్యానం చేస్తున్నట్లున్న చిత్రాన్ని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ.. హరి తాడోజుతో వేయించుకొని, తనను కలిసిన ప్రధాని నరేంద్ర మోదీకి పెయింటింగ్‌ని బహూకరించారు.. ఆ విషయాన్ని ప్రధాని మోదీ తనట్విట్టర్ ఖాతాలో పోస్ట్‌చేశారని, ఈ విషయంతనకు ఎంతో సంతోషాన్ని చ్చిందని హరి తాడోజు తెలిపారు. ప్రధాని మనసు దోచిన ఈ పెయింటింగ్‌ను చూసి మిత్రులు హరి తాడోజుకు అశేషంగా అభినందనలు తెలుపుతున్నారు.

పోలవరం నిర్వాసితులను కాపాడండి

● తొలిసారి అసెంబ్లీలో గళం విప్పిన రంప ఎమ్మెల్యే మిరియాల శిరీష



అసెంబ్లీలో మాట్లాడుతున్న రంప ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం/చింతూరు జులై26: పోలవరం ప్రాజెక్టు, గోదావరి వరదల మూలంగా ఇబ్బందులు పడుతున్న రంపచోడవరం నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను కాపాడాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిపోతున్న వేళ చివరిగా తనకు వచ్చిన కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆమె పలు సమస్యలను లేవనెత్తారు. నాలుగు విలీన మండలాల్లోని 130 ఆవాసాలలో 34 వేల కుటుంబాలు వరదల ప్రభావానికి గురయ్యారన్నారు. ఈ గ్రామాల్లో ఎక్కడా శాశ్వత వరద పునరావాస కేంద్రాలు లేకపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారీ కొండలపైనే తలదాచుకుంటున్నారన్నారు. గత 15 సంవత్సరాలుగా ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో లేదని, 10 సంవత్సరాలుగా వైసీపీ అధికారంలో కొనసాగిందని, ఫలితంగా ఇక్కడి ప్రజలను పట్టించుకునే వారే లేరన్నారు. సరైన వరద సహాయం అందని పరిస్థితులను వైసీపీ పాలనలో ఎదుర్కొన్నామని, దోమ తెరలూ కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ వరదల్లో కలెక్టరు ఏర్పాట్లు చేసినా నిత్యావసర వస్తువులు అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అక్కడి ప్రజలకు హామీ ఇచ్చి తాను అసెంబ్లీలో అడుగుపెట్టానని, అనేక సమస్యలతో తన నియోజకవర్గం ఉన్నదన్నారు. పోలవరం కింద నిర్వాసితులకు సురక్షిత ప్రాంతాలలో వారు కోరుకున్న చోట పునరావాస కాలనీలను నిర్మించాలని కోరారు. పోలవరం తమకు వరమా లేక శాపమా అని ఈ నాలుగు విలీన మండలాల ప్రజలూ భావిస్తున్నారన్నారు. ఇక జీ.ఓ.నెం.3 పునరుద్ధరణ అవసరాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. ప్రభుత్వం చేపట్టబోయే మెగా డీఎస్సీలో జీవో నెం.3లోని ఫలాలు అందేలా చూడాలని కోరారు.

పందుల పందేలపై దాడి.. ఐదుగురి అరెస్టు

ముమ్మిడివరం, జూలై 26: కొత్తలంక శివారు పచ్చమట్లవారిపాలెంలో పందుల పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పచ్చమట్లవారిపాలెం కొబ్బరితోటలో శుక్రవారం పందుల పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలో 7 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

కాకినాడ

నేడు ఐటీఐ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 26: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి రెండో విడత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం ప్రభుత్వ పారిశ్రామికా శిక్షణ సంస్థలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : ఎంపీడీవో

కరప, జూలై 26: ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ పథకాలు అందరికీ వర్తించేలా చూడాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులు, గ్రామకార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, 90రోజుల మస్టర్ వేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకం కింద రూ.1.40 కోట్లు విలువచేసే 22 పనులకు అంచనాలు రూపొందించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆగస్టు 1న పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తిచేయాలని, 8న కాకినాడరూరల్ మండలపరిషత్ కార్యాలయంలో జరిగే దివ్యాంగుల శిబిరాన్ని అందరికీ తెలియపరచాలన్నారు. ఏఈలు వీవీఎస్ వర్ధన్, సుంకర రాంబాబు, గండ్రేటి శైలజ, ఏపీవో రమణకుమార్, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం : ఏడీఏ

ప్రత్తిపాడు, జూలై 26: చిరుధాన్యాల సాగు రైతులకు ఎంతో లాభదాయకమని జగ్గంపేట వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ వైవీ గంగాధర్ తెలిపారు. లంపకలోవ గ్రామంలో చిరుధాన్యాల సాగు రైతులకు శుక్రవారం సబ్సిడీపై రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, ఊగలు, అండ్రుకొర్రలు వంటి విత్తనాలను పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ చిరుధాన్యాలలో ఎక్కువ పీచు పదార్థం కలిగి ఉండి అలాగే పోషక విలువలు అధికంగా ఉంటాయని తక్కువ పెట్టుబడితో తక్కువనీటితో ఎకరానికి 4నుంచి 8 క్వింటాళ్ళ వరకు వీటి దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ విత్తనాలను 50శాతం సబ్సిడీపై కిలో రూ.36.25లకు అందజేస్తున్నామని ఎకరానికి 4కిలోలల వరకు రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు. చిరుధాన్యాల సాగులోచేపట్టాలని మెళకువలు, వ్యవసాయ పద్ధతులు రైతులకు వివరించారు.

'ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలి'

జగ్గంపేట, జూలై 26: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలలీలకు పాత బకాయిలు చెల్లించి, పని దినాలను పెంచాలని ఆంధ్రప్రదేశ్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జగ్గంపేట ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి పనిని పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు మంచినీరు, వైద్య సదుపాయం కల్పించకుండా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజుకు రూ.30 కనీస వేతనం చెల్లించాలని కోరారు.

శ్మశానవాటికకు స్థలాలు పరిశీలించిన ఆర్డీవో

ఉప్పాడ (కొత్తపల్లి), జూలై 26: ఉప్పాడ శివారు గ్రామాలకు శ్మశానవాటిక స్థలం కేటాయించడంపై కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ శుక్రవారం బీచ్‌రోడ్డులో ఎస్సీ జీఎల్ విద్యుత్‌ప్లాంటు సమీపంలో స్థలాలను పరిశీలించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో శుక్రవారం సాయంత్రం బీచ్‌రోడ్డులో విద్యుత్ ప్లాంటు సమీపంలో లేఅవుట్ చేసిన ప్రాంతంలో శ్మశానవాటికు స్థలాన్ని పరిశీలించారు. శ్మశానవాటిక కోసం పరిశీలించిన వివరాలతో ప్రతిపాదనలను కలెక్టర్ అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. తహశీల్దార్ సుందరరాజు, మత్స్యకార ప్రతినిధులు ఉన్నారు.

ఐడియా థాన్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

గండేపల్లి, జూలై 26: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్(ఐఎస్ఎఫ్) రాష్ట్రవ్యాప్తంగా ఐడియా థాన్/రూరల్ స్టార్టప్ పిచ్ పోటీలను నిర్వహిస్తుంది. కాకినాడ రీజియన్‌కు సంబంధించిన ఆదిత్య యూనివర్శిటీ ఆతిథ్యమిస్తున్నట్టు యూనివర్శిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఐడియా థాన్ ఆగస్టు 12న, ప్రాంతీయ గ్రామీణ స్టార్టప్ పిచ్ పోటీలు ఆగస్టు 31న జరుగుతాయన్నారు. విజేతలందరికీ సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 వరకు అంకురా స్టార్టప్ బస్సు యాత్రలో పాల్గొనే అవకాశముంటుందన్నారు. ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రోవైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, కెరీర్ డెవలప్‌మెంట్ డీన్ జె.డి వెంకటేశ్ పాల్గొన్నారు.

డీఎల్‌ఎంటీలకు శిక్షణా తరగతులు

సామర్లకోట, జూలై 26: సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో 11 జిల్లాలకు చెందిన డీఎల్‌ఎంటీల మూడో బ్యాచ్‌కు 3రోజుల శిక్షణా తరగతులకు శుక్రవారం శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ హాజరయ్యారు. నీటి సమృద్ధి గల గ్రామాన్ని తయారుచేసేందుకు వాటర్ బడ్జెట్, జలజీవన్ మెషీన్, ప్రతీ ఇంటికీ వాటర్‌ట్యాప్ కనెక్షన్, తదితర అంశాలపై వివరించారు. వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు శ్రీదేవి, ప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, చక్రపాణీరావు, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ హరి తదితరులున్నారు.

గ్రామ పంచాయతీ సభ్యుడి ఆత్మహత్య

సామర్లకోట, జూలై 26: సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ పంచాయతీ సభ్యుడు బొబ్బిలి వీరవెంకట సత్యనారాయణ(35) శుక్రవారం తెల్లవారుజామున తన ఇంటిలోని గదిలో సీలింగ్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పలు అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, సామర్లకోట ఎస్ఐ మౌనిక పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని కుటుంబసభ్యుల నుంచి సమాచారాన్ని సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తుని రూరల్, జూలై 26: తండ్రి మందలించాడని పురుగుల మందు తాగి యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన మండలంలోని కొలిమేరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రాచపోతుల రాజును (26) తండ్రి మందలించడంతో తోటలోకి వెళ్లి గురువారం పురుగుల మందు తాగాడు. అతడిని తునిలో ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు, కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో మోటార్‌సైకిళ్లు దగ్ధం

పిఠాపురం, జూలై 26: పిఠాపురంలో జరిగిన అగ్నిప్రమాదంలో మోటార్‌సైకిళ్లు దగ్ధమయ్యాయి. పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో మున్సిపల్ షాపింగ్ కాంపెక్సులో కరీమ్ ఆటోగేరేజ్ ఉంది. అయితే రోజు మాదిరిగానే గురువారం రాత్రి పనులు అనంతరం షాపునకు తాళాలు వేసి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున షాపులో అకస్మాతుగా మంటలు చెలరేగాయి. నాలుగు మోటార్‌సైకిళ్లు దగ్ధమైనట్టు కరీమ్ తెలిపారు.

10 కాసుల బంగారం చోరీ

జగ్గంపేట, జూలై 26: మండలంలో రాజపూడిలో సీదిరి శివదుర్గ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు 10 కాసుల బంగారం చోరీ చేశారు. శివదుర్గ సమీప బంధువులు మృతిచెందడంతో కుటుంబమంతా గురువారం అక్కడికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూసుకునే సరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న పది కాసుల బంగారం, రూ.3.50లక్షలు చోరీ అయినట్టు గుర్తించారు. దీనిపై శుక్రవారం జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేశారు.

సామర్లకోటలో ఆటో చోరీ

సామర్లకోట, జూలై 26: శుక్రవారం తెల్లవారుజామున సామర్లకోట జగ్గమ్మగారిపేట వద్ద వెంకట శివసత్యనారాయణకు చెందిన ఏపీ 05 టీఏ 6968 నంబరు గల ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్టు వెంకటశివసత్యనారాయణ పోలీసులకు సీసీ కెమెరా పుటేజీలతో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

శాకంబరిగా దుర్గాదేవి

గొల్లప్రోలు, జూలై 26: పట్టణంలోని కరణంగారి తోటలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని పలు రకాల కాయగూరలతో శాకంబరిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కుంకుమపూజలు జరిగాయి. కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



సైనికుల త్యాగం అజరామరం

» జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు

» కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు





పెద్దాపురంలో మాజీ సైనికుడిని సత్కరిస్తున్న నాయకులు, సర్పవరం జంక్షన్: మాజీ సైనికులకు సత్కారం

పెద్దాపురం, జూలై 26: దేశ రక్షణలో సైనికుల త్యాగం అజరామరం అని జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి అన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను పురస్కరించుకుని పట్టణానికి చెందిన మాజీ సైనికుడు డాక్టర్ గుమ్మెళ్ల పట్టాభిరామశేఖర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబు రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిక్కిన విశ్వేశ్వరరావుతో కలిసి సత్కరించారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేశభక్తిని చాటుతూ భవిష్యత్ తరాలు మరింత విజయవంతంగా ముందుకెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. యుద్ధంలో పాల్గొన్న సైనికులను గౌరవించుకోవడం మన విధి అన్నారు. బీజేపీ నేతలు దుర్గా మోహన్‌రావు, రవికిరణ్, తుమ్మల పద్మజ, రవికృష్ణ, ప్రసాద్, సర్వసిద్ధి సతీష్, చీకట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: దేశ రక్షణ కోసం సాయుధ దళాలు చేస్తున్న సేవలను జాతి ఎన్నటికీ మరవలేదని రిటైర్డు ఆర్మీ ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్గిల్ దినోత్సవం సందర్భంగా త్రివిధ దళాలకు చెందిన రిటైర్డు సైనికులు, సైనికోద్యోగులు శ్రీనగేష్, ఎస్.రామారావు, సీఆర్ఎస్ ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, కెసత్యనారాయణ, జి.కృష్ణమోహన్, జి.సుబ్బారావు, ఈప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు. రామారావుపేటలో కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభ నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐడీఏ సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, సభ్యులు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ కిరణ్, డాక్టర్ సిరాజ్, డాక్టర్ వీవీ రావు తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్: స్థానిక మౌంట్ లీట్రా జీ స్కూల్‌లో ఆర్మీ మాజీ జవాన్లు వస్స రాంబాబు, నాయక్ ఎ.శంకర్, సీపీఎల్‌ఏ సూర్యారావును సత్కరించారు. కార్గిల్ యుద్ధంలో మరణించిన అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.రామదాసు, ప్రిన్సిపాల్ తనూజ ఆండాళ్, అడ్మినిస్ట్రేటర్ ఓఎం నారాయణ, కోఆర్డినేటర్ రాధ ఉన్నారు.

అన్నవరం: విద్యార్థులు చదువుతోపాటుగా దేశ సేవలో పాల్గొనాలని సత్యదేవా జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఘంటశాల వెంకట్ పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధ విజయం 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సంఘటన గుర్తుచేస్తూ గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్యలక్ష్మి, మాణిక్యాంబ, గోవింద్,సూరిబాబు ఉన్నారు.

సామర్లకోట: పట్టణంలో పలువురు దేశాభిమానులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత జవాన్ మట్టా సతీష్, మంచెం సాయిబాబు, ఆదివంశీ, మడగల శ్యామ్‌కుమార్, దేవత రాజేష్, డొంక శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఏసుదాసు



చంద్రబాబుకు వివరాలు చూపిస్తున్న వాసిరెడ్డి ఏసుదాసు

సర్పవరం జంక్షన్, జూలై 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్ర రాష్ట్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు, కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో కూటమి విజయం కోసం కృషి చేసినందుకు త్వరలో జరిగే నామినేటెడ్ పోస్టుల భర్తీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు ఏసుదాసు తెలిపారు.

చంద్రబాబును కలిసిన నులుకుర్తి



చంద్రబాబుతో నులుకుర్తి

కాకినాడ రూరల్, జూలై 26: కాకినాడ రూరల్ టీడీపీ ఎన్నికల కన్వీనర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు శుక్రవారం మంగళగిరిలోని కార్యాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులు, పార్టీ బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలపై వివరించారు. నియోజకవర్గం లో చేపట్టిన కార్యక్రమాలు, వాటికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్‌లు, వీడియోలను ఒక పుస్తక రూపంలో అందజేసినట్టు నులుకుర్తి తెలిపారు.

మంత్రిని కలిసిన కమిషనర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 26: కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన శుక్రవారం అమరావతిలో మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత భావన మంత్రి నారాయణ, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హరినారాయణను కలిశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 9మందికి జైలుశిక్ష

కాకినాడ క్రైం, జూలై 26: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిదిమంది వాహనదారులకు రెండేసి రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ సిటీ పరిధిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్-1, 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. 14 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని ట్రాఫిక్ పోలీసులు కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా 9మందికి 2రోజుల జైలుశిక్ష విధిస్తూ జడ్జి వి.నరసింహారావు తీర్పునిచ్చారు. మిగతా ఐదుగురికి తలో రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్టు ట్రాఫిక్ సీఐలు చైతన్యకృష్ణ, రమేష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ముగ్గురు వాహనదారులకు జరిమానా

సర్పవరం జంక్షన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వాహనదారులకు న్యాయమూర్తి తలో రూ.10 వేలు జరిమానా విధించినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే.శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించగా ముగ్గురు వాహనదారులు మద్యంతాగి బైక్‌లు నడుపుతున్నట్టు నిర్ధారించడం జరిగిందన్నారు. వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా జడ్జి నరసింహం ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు.

కాకినాడ నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 26: పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కొంత మంది సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పి.అశోక్‌కన్నారావు, జూనియర్ అసిస్టెంట్(కమిషనర్ సీసీ)ను రెవెన్యూ విభాగంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-3 సర్కిల్‌కు ఇప్పటివరకు అక్కడ పనిచేసిన జి.వీరప్రసాద్‌ను ఖాతా విభాగంలో బి1 అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. యూపీఏ విభాగంలో హెచ్2 అసిస్టెంట్ బి.శరత్‌చంద్రను పబ్లిక్ హెల్త్ సెక్షన్ ఎఫ్3 అసిస్టెంట్‌గా, ఇప్పటివరకు ఎఫ్3గా పనిచేసిన పి.మాణిక్యశిల్పను మహాత్మగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్‌గా, ఇప్పటివరకు హైస్కూల్‌లో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ ఎన్.వెంకటేష్‌ను యూపీఏలో హెచ్2 అసిస్టెంట్‌గాను బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 26: దుమ్ములపేట, సంజయ్‌నగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం, స్వచ్ఛతా వారోత్సవం నిర్వహించారు. దుమ్ములపేటలో పర్యటించి నీటి నిల్వలు ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జ్వరం వచ్చిన వెంటనే మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, డీఏవో రత్నకుమార్, డీపీవో సురేఖ, డీఎంవో భాస్కరరావు, ఎస్‌యువో రమేష్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యనందిస్తున్న ప్రభుత్వం

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర » విద్యార్థులకు కిట్ల పంపిణీ



గండేపల్లిలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న లచ్చయ్యదొర

గండేపల్లి, జూలై 26: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అన్ని వసతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉన్నత విద్యనందిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర అన్నారు. గండేపల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాటలు తప్ప చేతలు లేవని, కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని మౌళిక వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కోర్పు సాయి తేజ్, పరిమిబాబు, గ్రామ అధ్యక్షుడు వెలమాటి కాశీ, హెచ్ఎం వి.వెంకటేశ్వరరావు, వెంపాటి రాజు, ఇప్పిర్ల బాబి, వెంపాటి సతీష్, సుంకవిల్లి రమేష్, పైలా వెంకన్న, చాగంటి సత్యనారాయణ పాల్గొన్నారు. యల్లమిల్లిలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పనీల ఆధ్వర్యంలో సర్పంచ్ నాగజ్యోతి అధ్యక్షతన విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మద్దిపూడి వీర్రాజు, ఎంపీటీసీ రవి అశ్విని, టీడీపీ సీనియర్ నాయకులు సుంకవిల్లి వీరవెంకటసత్యనారాయణ (సీఎం), బండి రాంబాబు, పెనుమర్తి భాస్కరరావు, నూకతట్టు సుబ్బారావు, పోకల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: కాట్రావులపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తుల కిట్లను అందజేశారు. సర్పంచ్ పిట్ట సుగుణరావు, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షులు మునిరెడ్డి నాగేశ్వరరావు, ఏలటి బాబి, ఏలేటి బుల్లబ్బు,వెన్న వీరబాబు, బిక్కిన బాబి, పోలినాటి శాస్త్రి, పోలిశెట్టి ధర్మన్న కుమారి, ఎల్లాటి అమ్మాజీ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో టీడీపీ, జనసేన నాయకులు కఠారి రాజబాబు, రాచంశెట్టి లోవబాబు, కుతుకుమిల్లిలో బీజేపీ నాయకుడు రవణం సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు రెడ్నం దొరబాబు, కుక్కల రామకృష్ణ, జనసేన నాయ కుడు టీ.సురేష్, వాకతిప్పలో టీడీపీ నాయకుడు గుండా అప్పారావు, బీజేపీ నాయకుడు మేడ సాని వరలక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ మామిడి మలిబాబులు విద్యార్థులకు యూనీఫా, బ్యాగ్‌లు, షూలు పంపిణీ చేశారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్కూలు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల స్థల దాత చల్లా నూకరాజు, జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, సర్పంచ్ దొండపాటి లోవతల్లి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాంబాబు, టీడీపీ, జనసేన నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, మల్లిపూడి వీరబాబు, బుద్దాల చంటి, ఉలవకాయల సత్యనారాయణ, సూరిశెట్టి జయకృష్ణ, ఓరుగంటి వీరబాబు, కొల్లు బాబూరావు, శీరం రమణ, హెచ్ఎం సీహెచ్.ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



శంఖవరం:అవగాహన కల్పిస్తున్న సురేష్‌బాబు

శంఖవరం, జూలై 26: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులకు జిల్లా ఆడిట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి వై.సురేష్‌బాబు ఆదేశాలు జారీచేశారు. కత్తిపూడిలో స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించగా సురేష్‌బాబు పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజలకు అపారిశుధ్యం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రత్తిపాడు, జూలై 26: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపారు. ప్రభుత్వాసుపత్రి వద్ద స్వచ్ఛతా వారోత్సవాల సందర్భంగా ర్యాలీని ప్రారంభించారు. సౌమ్య మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా దోమలు సంచరించే ప్రదేశాల్లో క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులు

ప్రత్తిపాడు, జూలై 26: మండలంలో శుక్రవారం ఈదురుగాలులు ఉధృతంగా వీచాయి. వాతావరణంలో మార్పుల కారణంగా గంటకు 50 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పొలాల్లోని పాకలు పై కప్పులు ఎగిరిపోయాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో చిరుజల్లులతో వర్షం కురిసింది.

బడ్జెట్‌పై అవగాహన

జేఎన్టీయూకే, జూలై 26: వర్సిటీలోని పీఈ, సీఈ విభాగం సెమినార్ హాల్లో శుక్రవారం జేఎన్టీయూకే, యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రమణాజీ, కిరణ్మయి, వీరలక్ష్మి, వాలంటీర్లు ఉన్నారు.

రోడ్డు బురదమయం!

కొత్తపల్లి, జూలై 26: వర్షాల కారణంగా ఉప్పాడ శివారు కొత్తమాయాపట్నం రహదారి బురదమయం అవుతోది. ఇక్కడ కొత్తగా నిర్మించిన కాలనీలో కనీస వసతులు కల్పించకపోవడం వల్ల మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో మంచినీరు, సిమ్మెంటురోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



కొత్తమాయాపట్నంలో అధ్వాన రోడ్డు



గోరింటాకు నూరుతున్న ముత్తైదువులు

గోరింటాకు మహోత్సవం

కరప, జూలై 26: ఆషాఢమాసం సందర్భంగా వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి ఆలయంలో ధర్మకర్త పుణ్యమంతుల అప్పారావు, సూర్యావతి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం గోరింటాకు మహోత్సవం ఘనంగా జరిగింది. ముత్తైదువులు, యువతులు గోరింటాకు రోట్లో నూరి మొదటిగా అమ్మవారి చేతికి అలంకరించారు. అనంతరం ఒకరికొకరు తమ చేతులకు గోరింటాకు పెట్టారు.

108 రకాలతో సారె

ఏలేశ్వరం, జూలై 26: ఆషాఢమాసం పురష్కరించుకుని ఏలేశ్వరంలో గ్రామ దేవత శ్రీరూపులమ్మ ఆలయానికి 108 రకాల సారె శుక్రవారం అందజేశారు. విశ్వహిందూ పరిషత్, దుర్గావాహిని, మాతృశక్తి, మహిళా భజన సంఘాలు ఆధ్వర్యంలో పురోహితులు శ్రీకాంత్ వేద మంత్రాలతో, ఊరేగింపుగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు, పువ్వులు, పండ్లు 108 రకాల పిండి వంటలు తీసుకొచ్చి సమర్పించారు. ఆలయంలో మహిళలు లలిత సహస్రనామాలు, భజనలు చేశారు.



ఏలేశ్వరంలో అమ్మవారికి సమర్పించిన సారె

కేసులను సత్వరం పరిష్కరించాలి : ఎస్పీ



తొండంగిలో పోలీస్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ

కొత్తపల్లి, జూలై 26: వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌కు వచ్చే కేసులను సత్వరంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఏ కేసులను ఉంచవద్దని, బీచ్‌రోడ్డులో రాత్రి పూట పకడ్బందీగా గస్తీ నిర్వహించాలని ఎస్ఐ వీవీ స్వామినాయుడును ఆదేశించారు. కానిస్టేబుళ్ల క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు.

తొండంగి: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం తొండంగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎస్ఐ వినయ్ ప్రతాప్ తదితరులు ఉన్నారు.

పుస్తకాలు, పెన్నుల వితరణ

కరప, జూలై 26: స్థానిక మెరకవీధి ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. కాకినాడ ఆనంద్ భారతి మున్సిపల్ హైస్కూల్ పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ ఏటా ఈ వితరణ చేస్తున్నట్టు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. హెచ్ఎం కె.సీతామహలక్ష్మి, పూర్వ విద్యార్థులు ఈవీవీ సత్యనారాయణ, దారపు వేమనరెడ్డి, నేదునూరి ఉమామహేశ్వరరావు, గోకవరపు గురుప్రసాద్, జల్లు రాజా, జల్లు రాంబాబు, జనసేన నాయకులు పేకేటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

జగ్గంపేట, జూలై 26: మిషన్ శక్తి కార్యక్రమంపై జగ్గంపేటలో జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ శుక్రవారం అవగాహన కల్పించారు. మిషన్ శక్తి 100రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలలకు చట్టాలపై ప్రతి పాఠశాలు, గ్రామాల్లోను అవగాహన నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు రామకృష్ణరాజు, తిరుమల రాజు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం, జూలై 26: ఏలేశ్వరంపై మిషన్ శక్తి కార్యక్రమంపై ఏలేశ్వరంలో శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో కె.వరలక్ష్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వట్టి వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, లోవలక్ష్మి, ఎన్.అమలావతి పాల్గొన్నారు.

సిమెంటు రహదారి నిర్మాణం

ప్రత్తిపాడు, జూలై 26: మండలంలోని ఒమ్మంగి-శరభవరం గ్రామాల వద్ద సిమెంటు రహదారి పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఏలేశ్వరం, శాంతి ఆశ్రమం ఆర్అండ్‌బీ రహదారిలో రూ.1.70కోట్లతో గతంలో రహదారి నిర్మాణాలు చేపట్టి ఒమ్మంగి-శరభవవరం గ్రామాల వద్ద రహదారుల పనులు ప్రతిపాదించి వదిలివేశారు. వదిలివేసిన మార్గంలో సిమ్మెంటు రోడ్డు పనులను 3 రోజులుగా చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు

పిఠాపురం రూరల్, జూలై 26: పిఠాపురం మండలం జల్లూరులో ఆక్రమణలను శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. గ్రామంలోని హనుమంతకాలువను ఆక్రమించి బడ్డీలు, దుకాణాలు ఏర్పాటు చేశారని వి.రాముడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జేసీబీతో అక్కడ ఉన్న బడ్డీలు, దుకాణాలు తొలగించారు. రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

డ్రైయిన్లల్లో పూడిక తొలగింపు

పిఠాపురం రూరల్, జూలై 26: చిత్రాడలో 216వ జాతీయ రహదారిపై ఉన్న డ్రైయిన్లల్లో పూడికలను శుక్రవారం తొలగించారు. పూడికలు తొలగించకపోవడంతో కొద్దిపాటి వర్షానికే డ్రెయిన్లు పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపైకి చేరి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి ఎన్‌హెచ్ అధికారులు పూడిక తొలగింపు చేపట్టారు. సెంట్రల్ లైటింగ్ సక్రమంగా వెలగడం లేదని పలువురు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

దుర్గాడలో విశేష పూజలు

గొల్లప్రోలు రూరల్, జూలై 26: గొల్లప్రోలు మండలం దుర్గాడలో బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, మారేడుదళాలతో లక్షబిల్వార్చన, మహాగణపతి పూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది. ఆలయ అర్చకులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ, కవికిరణ్‌శర్మ, సుబ్బరావుశర్మ బృందం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, జూలై 26: రత్నగిరి క్షేత్రరక్షకిగా వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

క్వారీ లారీ బోల్తా

రౌతులపూడి, జూలై 26: క్వారీ మెటల్ తరలించే లారీ గిడజాం గ్రామ శివారును బోల్తా పడింది. లారీ తేటగుంట వైపు వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. రహదారి మార్జిన్‌లు బాగోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.